Sakshi

# టీచర్ పోస్టుల భర్తీ ఇక లేనట్టే!

- అవసరమైన చోట ఉన్న వారితోనే సర్దుబాటు
- మంత్రి గంటా శ్రీనివాసరావు స్పష్టీకరణ
- అన్ని ప్రవేశ పరీక్షలు ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తాం
- వర్సిటీ పోస్టుల స్క్రీనింగ్ టెస్టు బాధ్యత ఏపీపీఎస్సీకి



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల నియామకాలకు ఇక మంగళం పాడేసినట్లే. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు పరోక్షంగా ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఇప్పటికే విద్యార్థుల నిర్ణీత నిష్పత్తి కంటే ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువగా ఉందని, అవసరాన్ని బట్టే తప్ప డీఎస్సీ నియామకాలు ఇక కష్టమేనని చెప్పారు. వచ్చే ఏడాది ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే అంశంపై చర్చించేందుకు మంత్రి గంటా శుక్రవారం నిపుణులతో సమావేశమయ్యారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ వేణుగోపాలరెడ్డి, వైస్ చైర్మన్ నరసింహారావు, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ బి.ఉదయలక్ష్మి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి, వివిధ యూనివర్సిటీల వీసీలు, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భేటీ అనంతరం మంత్రి గంటా విలేకరులతో మాట్లాడారు. విద్యాహక్కు చట్టం ప్రకారం.. టీచరు, విద్యార్థుల నిష్పత్తి 1:30గా ఉండాలని, రాష్ట్రంలో 1:18గా ఉందని వివరించారు. కొన్ని చోట్ల విద్యార్థులు ఎక్కువగా ఉంటే టీచర్లు సరిపడా లేరని, మరికొన్ని ప్రాంతాల్లో టీచర్లు ఎక్కువగా ఉంటే విద్యార్థులు తక్కువగా ఉన్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో అవసరమైన చోట్ల ఇప్పుడున్న ఉపాధ్యాయులనే సర్దుబాటు చేస్తామని చెప్పారు. ఇక అవసరమైతేనే కొత్త డీఎస్సీకి అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. యూనివర్సిటీల్లో బోధనా సిబ్బంది పోస్టుల భర్తీకి సంబంధించి స్క్రీనింగ్ టెస్టు బాధ్యతను ఏపీపీఎస్సీకి అప్పగిస్తామన్నారు. ఏపీపీఎస్సీ మెరిట్ జాబితాలను అందిస్తే, వాటి నుంచి ఆయా వర్సిటీలు బోధనా సిబ్బందిని ఎంపిక చేసుకుంటాయని వెల్లడించారు.

### అక్టోబర్ 15 నుంచి డిజిటల్ తరగతులు

రాష్ట్రంలో ఉన్నత విద్యా కోర్సులకు సంబంధించి ఎంసెట్ సహా ఏడు ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించామని మంత్రి గంటా తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో తలెత్తే లోపాలు, ఇతర సమస్యలపై చర్చించామని చెప్పారు. ప్రవేశ పరీక్షలన్నీ ఆన్‌లైన్‌లోనే ఉంటాయని, విద్యార్థులను సన్నద్ధం చేయడానికి మాక్ టెస్టులు ఎక్కువగా నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ఈ సెట్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించామని గుర్తుచేశారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలను కూడా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించడంపై ఆలోచిస్తున్నామని చెప్పారు. డిజిటల్ తరగతుల ప్రాజెక్టును అక్టోబర్ 15 నుంచి ప్రారంభిస్తామన్నారు. ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షల్లో ఈ ఏడాది నుంచి జంబ్లింగ్ విధానాన్ని అమలు చేస్తామన్నారు. యూనివర్సిటీలకు మౌలిక సదుపాయాల కోసం మంజూరు చేసిన మొత్తాన్ని దశల వారీగా విడుదల చేస్తున్నామన్నారు. యూనివర్సిటీల ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఇద్దరు చొప్పున ఫైనాన్స్ అధికారులను నియమిస్తామని చెప్పారు. రాష్ట్రంలో ప్రైవేట్ యూనివర్సిటీలు వస్తున్నందున ప్రభుత్వ వర్సిటీలు వాటితో పోటీపడేలా ప్రమాణాలను పెంచాలని సూచించారు. అంబేడ్కర్, యోగి వేమన వర్సిటీలకు త్వరలోనే వీసీలను నియమిస్తామన్నారు.